క్లుప్తంగా

రావుల చెరువులో వ్యర్థాల తొలగింపునకు వినతి



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

గాజువాక: కూర్మన్నపాలెంలోని రావుల చెరువులో వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని రావుల చెరువు రాయల్స్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు జీవీఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొండా ఎల్లాజీరావు, కూటికుప్పల జనార్ధన్ గాజువాక జెడ్సీ సింహాచలంను కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యర్థాలను తొలగించి, మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కోరారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లుల చెల్లింపునకు సంబంధిత అధికారులను ఆదేశించడం, చెరువులో డీజిల్ మోటార్లతో నీటిని పంపింగ్ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గాజువాక: త్రైత సిద్ధాంత ప్రచారకులు ఏర్పాటు చేసిన నూతన తెలుగు క్యాలెండర్‌ను జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రచారకర్తలు క్యాలెండర్ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ సూపరింటెండెంట్ కూంద్రపు రమణ, ఇందూ జ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు నారాయణరావు, ప్రతినిధులు వై.వి.రమణ, ఆదినారాయణ, పుష్కరరావు, ఫకీర్ రాజు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

స్మృతుల పరిమళం

ఇందిరాగాంధీ పార్కులో పూర్వ విద్యార్థుల సందడి



పార్కులో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: ఉక్కునగరంలోని ఇందిరాగాంధీ పార్కు స్మృతుల పరిమళాన్ని వెదజల్లింది. జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం పార్కులో సందడి చేశారు. పాఠశాలలో చదివినప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పార్కులో ఫొటోలు తీసుకుని రోజంతా ఉల్లాసంగా గడిపారు. మళ్లీ కలుసుకోవాలని.. తమతో కలసి చదువుకున్న వారిలో ఎవరైనా ఆర్థికంగా ఇబ్బంది పడుతుంటే సాయం చేయాలని, దీని కోసం ఒక ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో దాసరి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గేట్ ర్యాంకర్లకు సత్కారం



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న విజ్ఞాన్ యాజమాన్యం

అగనంపూడి: గేట్‌లో ర్యాంక్ సాధించిన తమ కళాశాల విద్యార్థులను విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. గేట్ ఫలితాల్లో 136, 641, 1298 తదితర ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను విజ్ఞాన్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ బి.సతీష్, మెకానికల్ విభాగం డీన్ రాంబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యం వైపు అడుగులు

- వాకింగ్, వ్యాయామాలపై పెరుగుతున్న శ్రద్ధ
- జిమ్, కరాటేల వైపు యువత ఆసక్తి
- యోగా, ధ్యానంపై దృష్టి



వాకింగ్ చేస్తున్న మహిళలు



కరాటే సాధన చేస్తున్న చిన్నారులు

కూర్మన్నపాలెం: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ప్రస్తుత బిజీ లైఫ్‌లో ఆరోగ్య సంరక్షణనూ దినచర్యలో భాగంగా చేసుకుని ముందుకు వెళ్తున్నారు ఆరోగ్యాభిలాషులు. వ్యాయామం, నడక, ఆటల ద్వారా ఫిట్‌నెస్‌పై దృష్టి పెడుతున్నారు. తెల్లవారకముందే కూర్మన్నపాలెం, పరిసరప్రాంత వాసులు తమ దినచర్యను వ్యాయామంతో ప్రారంభిస్తున్నారు. దీంతో రహదారులు, పార్కులు జనాలతో సందడిగా మారుతున్నాయి. మధ్య వయసు వారు జాగింగ్‌కు, వృద్ధులు వాకింగ్‌కు బయల్దేరితే యువత జిమ్, ఫిట్‌నెస్ స్టూడియోల్లో కుస్తీలు పడుతున్నారు. ఇక బాలబాలికలు, యువత యోగా, కరాటే ట్రైనింగ్‌లో బిజీబిజీ అయిపోతున్నారు. ఇలా మొత్తానికి అన్ని వయసుల వారు తమ ఆరోగ్యంపై శ్రద్ధ కనబరుస్తూ మిగిలిన వారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

పెరుగుతున్న ఆసక్తి

మారిన జీవనశైలి, పెరుగుతున్న మానసిక ఒత్తిడి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతో దాదాపు అన్ని వయసుల వారు చిన్న చిన్న రుగ్మతలతో సతమతమవుతున్నారు. మానసిక ఒత్తిడితో బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు శరీరంలో తిష్ట వేస్తున్నాయి. దీంతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ లక్షల రూపాయలు వైద్యానికి ఖర్చు చేయాల్సి వస్తోంది. దీని నుంచి బయటపడేందుకు వైద్యులు, మానసిక నిపుణుల సూచనల మేరకు వ్యాయామం, యోగా, ధ్యానం వంటివాటిపై దృష్టి సారిస్తున్నారు.

జిమ్‌లకు క్యూ

కూర్మన్నపాలెం, వడ్లపూడి పరిధిలోనే సుమారు 15 నుంచి 20 వరకు జిమ్‌లు ఉన్నాయి. ప్రతీ జిమ్‌లో రోజుకు 100 నుంచి 150 మంది వ్యాయాయం చేసేందుకు వస్తుంటారు. ఇంకా.. బాక్సింగ్, కిక్ బాక్సింగ్, కరాటే, కుంగ్‌ఫూ, యోగా, బ్యాడ్మింటన్ తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. దీంతో రోజుకు సుమారు 300 మంది పార్కుల్లో శిక్షణ పొందుతున్నారు.

సందడిగా పార్కులు

కూర్మన్నపాలెం, వడ్లపూడి పరిధిలో నివసిస్తున్న సుమారు 200 నుంచి 300 మంది రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుల్లో వాకింగ్, జాగింగ్ చేసేందుకు వస్తుంటారు. ముఖ్యంగా తిరుమలనగర్ పార్కు, రాయలచెరువు వాకర్స్ పార్కు, చిల్డ్రన్స్‌పార్కు తదితర పార్కుల్లో వాకింగ్, జాగింగ్, వ్యాయామం చేస్తుంటారు. ఒకప్పుడు నగర ప్రాంతాల్లో కనిపించే వ్యాయామ కేంద్రాలు ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ విస్తరించడం ప్రజలకు ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధను తెలియజేస్తోంది.



పార్కులో వ్యాయామం చేస్తున్న మహిళలు, పెద్దలు

వాకింగ్‌తో రోజంతా ఉత్సాహం



శారీరక శ్రమ, మానసిక ఒత్తిడితో బాగా అలసట ఉండేది. దీంతో ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయి. ఒక రోజు స్నేహితురాలి సలహా మేరకు వాకింగ్‌కు వెళ్లాను. సూర్యోదయ వేళ నడక చాలా ఉల్లాసాన్ని ఇచ్చింది. అలసట పోయి ఒత్తిడిని జయించినట్లు అనిపించింది. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉంటోంది. – టి.లక్ష్మి, వడ్లపూడి

జిమ్‌తో ఫిట్‌నెస్



యువత జిమ్ చేయడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ శాతం తగ్గడంతో పాటు ఫిట్‌నెస్ పెరుగుతుంది. దీనివల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు. యువత జిమ్ చేస్తే క్రీడల్లోనూ రాణించవచ్చు.

–కె.కృష్ణ, జిమ్ కోచ్, కూర్మన్నపాలెం

పీహెచ్‌సీలో నాణ్యమైన వైద్య సేవలు

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్



సమావేశంలో పాల్గొన్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

గాజువాక: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన వైద్య సేవలను అందించే విధంగా సిబ్బంది పని చేయాలని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, కార్పొరేటర్ రాజాన రామారావు కోరారు. పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రులను అన్ని విధాలా అభివృద్ధి చేస్తోందన్నారు. దీంతో ప్రజలు కూడా ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నారని, వారికి అవసరమైన శస్త్ర చికిత్సలను చేసేందుకు కూడా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రికి సంబంధించిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ మాట్లాడుతూ పీహెచ్‌సీలలో స్పెషలిస్టుల సేవలు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆశ కార్యకర్తలు, సిబ్బంది ప్రజలకు తెలియజేయాలన్నారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం మాట్లాడుతూ ఆస్పత్రికి సంబంధించిన రక్త పరీక్షలు, ఇతర అవసరాలకు అవసరమైన నిధులను ఈ కమిటీ ద్వారా ఖర్చు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ, జిల్లా ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ జీవనరాణి, వైద్యాధికారి డాక్టర్ పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో మాస శివరాత్రి పూజలు



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమా రామలింగేశ్వర ఆలయంలో మాస శివరాత్రి పూజలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఉన్న దేవతామూర్తులను అలంకరించి పూజలు చేశారు. వేకువజామున ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. మహాదేవునికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయ స్వామి, అయ్యప్ప స్వామి, పర్వతవర్థిని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాస్, సురేంద్ర, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపై ఆకట్టుకున్న చిత్రాలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



అడవుల సంరక్షణపై విద్యార్థులు గీసిన చిత్రాలు

అక్కిరెడ్డిపాలెం: ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని 68వ వార్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అడవుల పరిరక్షణ అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో 3 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం మాట్లాడుతూ అడవులతో మానవాళికి ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. చెట్లను నాటి వాటిని సంరక్షించాలని, అడవులను పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్లు బి.రవిచంద్, దేముళ్లు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో కరాటే మాస్టర్

పెదగంట్యాడ: కరాటే అనేది ఒక యుద్ధ కళ మాత్రమే కాదని, ఆత్మరక్షణకు కూడా ఉపయోగపడుతుందని కరాటే మాస్టర్ నారాయణమూర్తి అన్నారు. శాటికన్ స్పోర్ట్స్ కరాటే డో క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో పెదగంట్యాడకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. వారికి సోమవారం దయాల్‌నగర్‌లో బహుమతులు, మెడల్స్ అందజేశారు. ఒమ్మి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



క్యాన్సర్ బాధితునికి రూ.20వేల నగదును అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: క్యాన్సర్ రోగికి సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారం అందించింది. 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ పినడమకకు చెందిన అండిబోయిన రమణ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ట్రస్ట్ పిలుపు మేరకు దాతలు ముందుకు వచ్చి బాధితుడు రమణకు రూ.20 వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించారు. జనసేన వార్డు ఇన్‌చార్జి గవర సోమశేఖర్, ట్రస్ట్ ప్రధాన సలహాదారుడు పట్టా రామ అప్పారావు చేతుల మీదుగా వీటిని అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, గ్రామ పెద్ద సాలాపు అచ్చిబాబు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తూర్పు కాపులందరికీ ఓబీసీ రిజర్వేషన్లకు వినతి



బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గాజువాక: ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు కాపులందరికీ రాష్ట్ర వ్యాప్తంగా ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని తూర్పు కాపు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు ఢిల్లీలోని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగరామ్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. తూర్పు కాపులు ఉపాధి నిమిత్తం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నివాసాలను ఏర్పరుచుకుని జీవిస్తున్నారని, కానీ కేవలం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉంటున్న తూర్పు కాపులకే ఓబీసీ రిజర్వేషన్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇతర జిల్లాల్లోని తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన తూర్పు కాపు సంఘం నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, మెరగాని ప్రసాద్, చెనమల గంగాధర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌తో ప్రతిపాదిత ఒప్పందాలపై త్వరలో సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఐలా కమిషనర్, ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఐలా భవనంలో ఐలా కమిటీతో పారిశ్రామిక వేత్తల సమావేశం నిర్వహించారు. ఏపీఐఐసీ ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో సెయిల్ అధికారులతో ప్రతిపాదిత ఒప్పందాలపై చర్చించారు. ఐలా కమిషనర్ సూర్యనారాయణ మాట్లాడుతూ త్వరలో జరగనున్న తదుపరి సమావేశంలో సెయిల్‌తో మరికొన్ని సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేలా చర్చలు జరగనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ప్రతినిధులకు నియామక పత్రాలు



రోటరీ ప్రతినిధులను అభినందిస్తున్న దృశ్యం

గాజువాక: గాజువాక స్టీల్‌సిటీ రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన సీహెచ్.రిషీకేష్, బాసంగి తిరుపతిరావులను ఆ సంస్థ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.సుబ్బారావు (దత్తు) అభినందించారు. నగరంలో సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు నారాయణరావు, తెంటు సత్యనారాయణ, బలివాడ సత్యారావు, కరకవలస గౌరీ ప్రసాదరావు, డబ్బీరు హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో భారీ వర్షం



వర్షం నీటికి చెరువులా మారిన రోడ్డు

పెదగంట్యాడ: పెదగంట్యాడ మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి ఏడు గంటల నుంచి గంటపాటు ఏకధాటిగా కురవడంతో గెడ్డలు పొంగాయి. రోడ్లు మొత్తం వర్షం నీటితో నిండిపోయి చెరువులను తలపించాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు రావడంతో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పోర్టు వంతెన వద్ద గెడ్డలో చెత్త పేరుకుపోవడంతో జీవీఎంసీ గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ దగ్గరుండి సిబ్బందితో శుభ్రం చేయించారు. చెత్తను తొలగించి నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలి



ధర్నాలో ప్రసంగిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రైవేటీకరణను అమలు చేయడానికి స్టీల్‌ప్లాంట్‌ను సిక్ ఇండస్ట్రీ చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. ఏడాదికి సరిపడా ముడి పదార్థాలు నిల్వ ఉంచాల్సి ఉండగా, వాటిని అందుబాటులో లేకుండా చేయడం ద్వారా ఉత్పత్తిని నిలిపివేయాలని కుట్ర చేస్తున్నారన్నారు. ప్లాంట్‌ను మూసేసి అదానీకి అమ్మాలని కేంద్రం చూస్తోందన్నారు. వెంటనే ముడి పదార్థాలు ఏర్పాటు చేయాలని, రుణాలను ఈక్విటీగా మార్చడంతో పాటు 10 ఏళ్లు ఇంట్రస్ట్ హాలిడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోరాటాలతో సాధించుకున్న ప్లాంట్‌ను అదే పోరాటాలతో కాపాడుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, వివిధ కార్మిక సంఘాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం



మాజీ ఎమ్మెల్యే చింతలపూడికి జ్ఞాపిక బహూకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు నిర్వాసిత కాలనీలోని రుణవిమోచన లక్ష్మీ గణపతి స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా జరిపించారు. ఆలయంలోని స్వామి వారిని పుష్పాలతో అలంకరించి, మహాన్యాస పూర్వక పంచామృతాభిషేకం, అనంతరం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. మేళ తాళాలతో పల్లకీ సేవ చేశారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొని విశేష పూజలు జరిపించారు. సత్యసాయి భజన మండలి మహిళా విభాగం ఆధ్వర్యంలో లలితా సహస్ర పారాయణం చేశారు. గత నెలాఖరున పదవీ విరమణ పొందిన ఉక్కు కార్మిక సంఘం నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మరో పది మంది సామాజిక కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దానబాల అప్పలనాయుడు, నాయకులు ఎల్.వి.రమణ, కొలిపాక అప్పారావు, గుదే గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలు కార్మిక సంక్షేమానికి గొడ్డలిపెట్టు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్మిక సంక్షేమానికి గొడ్డలి పెట్టువంటివని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కార్మికులమంతా కలిసి ఈ విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలేదీక్షలు సోమవారానికి 767వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎక్స్ సర్వీస్‌మెన్ పాల్గొన్నారు. కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే, మౌలిక సదుపాయాల కల్పనలన్నీ కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలపై భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దేశంలో అభివృద్ధి పూర్తిగా శూన్యమైపోతుందని, అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



పోటీల ప్రారంభ చిహ్నంగా శాంతి కపోతాలు ఎగురవేస్తున్న ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్



పోటాపోటీగా తలపడుతున్న వాలీబాల్ క్రీడాకారులు

అగనంపూడి: మండల స్థాయి గ్రామీణ క్రీడా పోటీలు ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 85వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా సాగాయి. సోమవారం ఉదయం ఎన్టీపీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజు సిన్హాలు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో పరవాడ మండలంలోని 14 ఉన్నత పాఠశాలలకు చెందిన 480 మంది విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. బాలురు విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, బాలికలకు కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్టీపీసీ జీజీఎం సిన్హా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఏటా ఈ పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులకు చదువుతో ఆటలు తప్పనిసరన్నారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రుమా డీ శర్మ, డీజీఎం అనితాకుమార్, మేనేజర్ ప్రకాశరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకులు శేఖర్, కిరణ్, నాగు, మండల ఫిజికల్ డైరెక్టర్లు మోటూరు నాగేశ్వరరావు, పిల్లా రవిశంకర్, బుడుమూరు అన్నాజీరావు, లోవరాజు, శ్రీదేవి, తులసీ, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల ధర్నా

మహారాణిపేట: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయిస్ హమాలీలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ హమీలీస్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పీఎఫ్, పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. యూనియన్ నాయకులు ఎం.మన్మథరావు, పైల అప్పారావు, ఎం.వెంకటరమణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.